ఓపీఎస్ కోసం నినదించిన ఉద్యోగులు

- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ సీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో సాగర సంగ్రామ దీక్ష


- వార్త 7వ పేజీలో



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన 'సాగర సంగ్రామ దీక్ష' శిబిరంలో సీపీఎస్‌ను రద్దుచేయాలని నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

రా.. కదలి రా!

నేడు గొండుపాలెంలో టీడీపీ బహిరంగ సభ



గొండుపాలెంలో 'రా.. కదలిరా' బహిరంగ సభా వేదిక

- నేడు గొండుపాలెంలో టీడీపీ బహిరంగ సభ
- హాజరుకానున్న పార్టీ అధినేత చంద్రబాబునాయుడు
- భారీగా జనసమీకరణకు ఏర్పాట్లు

అనకాపల్లి/కె.కోటపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'రా.. కదలి రా!' నినాదంతో సోమవారం మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు, టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఉదయం 11.30 గంటలకు ఇక్కడకు చేరుకుని సుమారు రెండు గంటలపాటు ప్రసంగించనున్నారు. రా.. కదలి రా! సభ కోసం సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన వేదికతోపాటు వీఐపీలు, మీడియా ప్రతినిధులు, టీడపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, మద్దతుదారులు. ఇలా వివిధ వర్గాల వారి కోసం ప్రాధాన్యతాక్రమంలో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సభా వేదికకు సమీపంలో హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్‌కు వేర్వేరుగా స్థలాలను కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించిన తరువాత తొలిసారి అనకాపల్లి జిల్లాలో వస్తుండడంతో బహిరంగ సభను విజయవంతం చేయడానికి, భారీ ఎత్తున జనసమీకరణకు ఏర్పాట్లు చేశారు. చోడవరం, కె.కోటపాడు, విశాఖపట్నం నుంచి గొండుపాలెం వచ్చే దారులన్నీ స్వాగత



ప్రజలు కూర్చొనేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు

ఫ్లెక్సీలతో నిండిపోయాయి.

ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు

గొండుపాలెంలో సోమవారం జరగనున్న సభ ఏర్పాట్లను ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు పైలా ప్రసాదరావు, లాలం కాశీనాయుడు, దాడి రత్నాకర్, కిమిడి నాగార్జున, మల్లిక్ తదితరులు పర్యవేక్షించారు. జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల నుంచే కాకుండా విశాఖపట్నం జిల్లా పెందుర్తి, భీమిలి, గాజువాక, అల్లూరి జిల్లా పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున సభకు హాజరవుతారని పార్టీ నాయకులు తెలిపారు. జనసమీకరణకు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబు పర్యటన షెడ్యూల్...

- ఉదయం 10 గంటలకు చంద్రబాబునాయుడు ఉండ వల్లిలోని నివాసం నుంచి హెలీకాప్టర్‌లో బయలు దేరతారు.
- 11.20 గంటలకు కె.కోటపాడు మండలం గొండుపాలెం హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11..30 గంటలకు రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు వస్తారు
- 1.35 గంటల వరకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు
- 1.40 గంటలకు సభావేదిక నుంచి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు
- 1.45 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కనిపూడిలో జరిగే 'రా.. కదలిరా' సభకు వెళతారు.

వైసీపీలో గుర్తింపు లేదు

డిప్యూటీ సీఎం పోలీసు కేసులు పెట్టిస్తున్నారు



మీడియా సమావేశంలో వేచలం ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి, మాజీ సభ్యుడు బలరామమూర్తి, వైసీపీ నేతలు

- వేచలం ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి ఆవేదన
- నేడు చంద్రబాబు సమక్షంలో 500 కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరనున్నట్టు వెల్లడి

-7లో

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

- జోగంపేట బాలుర వసతిగృహంలో సంఘటన

-7లో



మృతిచెందిన విద్యార్థి దావీద్‌రాజ్ (ఫైల్ ఫొటో)

అభ్యర్థులు 50 వేలు ఖాళీలు 8?

ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ ఖాళీలివే!

- జిల్లా విద్యాశాఖకు అందిన సమాచారం
- రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీల సంఖ్య 1,728
- అత్యధికంగా కర్నూలు జిల్లాలోనే 1,646 పోస్టులు
- మిగిలిన అన్ని జిల్లాలకు కలిపి కేవలం 82
- అధికారుల తీరుపై ఆశావహుల ఆగ్రహం



విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం హడావిడిగా విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఆశావహులను ఉసూరుమనిపించేలా కనిపిస్తోంది. ఐదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్న వారికి తాజా నోటిఫికేషన్ అశనిపాతంలా పరిణమించనుందనే వాదన వినిపిస్తోంది. కొద్దిరోజుల కిందట నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్) పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

» జోగంపేట బాలుర వసతిగృహంలో సంఘటన

గొలుగొండ, ఫిబ్రవరి 4: మండలంలోని జోగంపేటలో వున్న సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో విద్యుదాఘాతానికి గురై ఒక విద్యార్థి మృతిచెందాడు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. జోగంపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు 93 మంది వుంటున్నారు. పాతమల్లంపేట గ్రామపంచాయతీ శివారు బుడ్డడపాడు గ్రామానికి చెందిన తుబిరె దావీద్‌రాజ్(12) జోగంపేట హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతూ, సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో వుంటున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో దుస్తులు ఉతుక్కొని, ఆరబెట్టుకోవడానికి మరో విద్యార్థితో కలిసి మేడపైకి వెళ్లాడు. వాటర్ పైపులైన్ పక్కనే వున్న ఇనుప పైపుపై దుస్తులు వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పక్కనే వున్న సహచర విద్యార్థి బిగ్గరగా కేకలు వేయడంతో హాస్టల్ సిబ్బంది మేడపైకి వెళ్లారు. అపస్మారకస్థితిలో పడివున్న దావీద్‌రాజ్‌ను గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ఎస్ఐ కృష్ణారావు హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులను ఎస్ఐ విచారించారు. దావీద్‌రాజ్ దుస్తులు ఆరబెట్టిన ఇనుప పైపునకు కరెంట్ ఎర్త్ అవుతున్నట్టు గుర్తించామని ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

లాడ్జిలో నరసన్నపేట వాసి మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4: స్థానిక ఒక లాడ్జిలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం బొడ్డుపల్లి గ్రామానికి చెందిన శిర్లాపు దుర్గారావు (55 నుంచి 60 ఏళ్లు) ఆదివారం మృతి చెందాడు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 31వ తేదీన అనకాపల్లిలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన ఒక లాడ్జిలో శిర్లాపు దుర్గారావు రూమ్ తీసుకున్నాడు. రెండు రోజులుగా ఇక్కడే ఉండి భోజనం చేయలేదని, ఇతడు లివర్ ఇబ్బందులతో వైద్యం పొందుతున్నాడని సీఐ శంకరరావు తెలిపారు. రెండు రోజులుగా రూమ్ తలుపులు దగ్గరకు వేసి ఉంచాడని ఆదివారం ఉదయం అపస్మారకస్థితిలో ఉన్న దుర్గారావును రూమ్‌బాయ్ చూశాడన్నారు. ఆయన వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా వారు వచ్చారన్నారు. భార్య రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ శంకరరావు తెలిపారు. ఈయన మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, ఎన్టీఆర్ వైద్యాలయంలో వైద్యులు పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఆయన చెప్పారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారని సీఐ శంకరరావు తెలిపారు.

న్యాయంపూడిలో దొంగతనం

నక్కపల్లి, ఫిబ్రవరి 4: మండలంలోని న్యాయంపూడిలో గోరింట వరలక్ష్మి ఇంటిలో దొంగతనం జరిగినట్టు సీఐ ఎ.విజయ్‌కుమార్ ఆదివారం విలేకర్లకు తెలిపారు. శనివారం ఉదయం వరలక్ష్మి ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగివచ్చేసరికి బీరువా తెరచివుండడంతో దొంగతనం జరిగినట్టు ఆమె గుర్తించినట్టు ఆయన చెప్పారు. బీరువాలో వున్న అరతులం బంగారం చైను, రూ.40వేలు నగదు, 20తులాల వెండి చోరీ జరిగినట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి కిటికీ పగులగొట్టి దొంగలు ఇంటిలోకి వెళ్లినట్టు గుర్తించారు. క్లూస్ టీం వివరాలు సేకరిస్తోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు.

వలంటీర్ హత్య కేసు లోతుగా విచారణ

» పోలీసుల అదుపులో మరో ముగ్గురు

మాకవరపాలెం, ఫిబ్రవరి 4: మండలంలోని లచ్చన్నపాలెంలో గ్రామ వలంటీర్ హరినాథ్ హత్య కేసును పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ఈ ఘటన జరిగి ఇప్పటికే నాలుగు రోజులైంది. హరినాథ్‌కు వివాహేతర సంబంధాలు ఉన్నాయని ప్రచారం జరగడంతో ఇప్పటికే పలువుర్ని స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. శనివారం మధ్యాహ్నం లచ్చన్నపాలేనికి చెందిన మహిళను, రోలుగుంట మండలం కొత్తూరుకు చెందిన తాపీమేస్త్రీని, అలాగే కత్తిపూడి గ్రామానికి చెందిన సరుగుడు వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. ఇంత వరకు లచ్చన్నపాలెంలో సుమారు 10మందిని విచారించారు. మృతదేహం వద్ద లభ్యమైన సెల్‌ఫోన్‌లోని సమాచారం ఆధారంగా విచారణ దాదాపు చివరి దశకు చేరుకుందని పోలీసులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారిందని చెప్పవచ్చు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతిచెందాడు. దొప్పెర్లకు చెందిన గవిరెడ్డి తరుణ్ (20) ఈనెల రెండున అచ్యుతాపురం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన తరుణ్‌ని విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు. తలకు తీవ్ర గాయం కావడంతో వైద్యాధికారులు శస్త్రచికిత్స చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆయన ఆదివారం మృతిచెందాడు.



మృతుడు తరుణ్(ఫైల్)

గంజాయితో నలుగురి అరెస్టు

జి.మాడుగుల, ఫిబ్రవరి 4: మండలంలో గంజాయితో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వాహనాలు తనిఖీలు చేపడుతున్న సమయంలో 2.33 కిలోల లిక్విడ్ గంజాయితో వీరు పట్టుబడ్డారన్నారు. ఈ ఘటనలో కేరళ రాష్ట్రానికి చెందిన వ్యాపారులు సినేశ్, జోషేప్, అనకాపల్లి జిల్లాకు చెందిన వెంకటేశ్, సురేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ వివరించారు.

డ్వాక్రా మహిళలకు బెదిరింపులు

» ఆసరా కార్యక్రమానికి రాకపోతే పథకాలు తొలగిస్తాం

» రవాణా ఖర్చులు గ్రూపు సభ్యులే భరించాలి

» కొత్తూరు వెలుగు సీసీ రాము హెచ్చరిక

కొత్తూరు(అనకాపల్లి), ఫిబ్రవరి 4 : మేజర్ పంచాయతీ కొత్తూరు ముత్రాసు కాలనీకి చెందిన డ్వాక్రా మహిళలకు వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ (సీసీ) దూలం రాము బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు వాట్సప్ గ్రూపుల్లో వాయిస్ రికార్డ్ ద్వారా సందేశాన్ని పంపారు. సోమవారం మార్టూరులో జరగనున్న వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరు కార్యక్రమానికి రాకపోతే సంక్షేమ పథకాలు తొలగిస్తామని హెచ్చరించారు. కొత్తూరు క్లస్టర్‌లోని 42 గ్రూపుల మహిళలు తప్పనిసరిగా హాజరుకావాలని హుకుం జారీ చేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఖర్చులు ఇవ్వబోమని, సొంత ఖర్చులతో ఆటోలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతంలో కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు రాలేదని, ఈసారి అలా చేస్తే రుణమాఫీ పథకాలు వర్తించవని స్పష్టం చేశారు. గతంలో ఈయనపై డ్వాక్రా సంఘాల నుంచి అధిక మొత్తంలో వసూలుకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో ఈ విధంగా హుకుం చేయడం పట్ల డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా మాడుగులలో జరగనున్న చంద్రబాబు బహిరంగ సభకు డ్వాక్రా మహిళలు వెళ్లకుండా ఈ విధంగా కుట్ర పన్నుతున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అలాగే వెలుగు సీసీ రాముపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

కోడి పందాల శిబిరంపై దాడి : ఒకరి అరెస్టు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఆదివారం కోడి పందాల శిబిరంపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ అట్టాడ విభీషణరావు తెలిపారు. ఈ సందర్భంగా రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైన కోడి పందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559



భరత్‌ను అభినందిస్తున్న రోహిత్ శర్మ



స్టేడియంలో జాతీయ పతాకంతో అభిమానులు



బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లండ్ ఆటగాడు బెన్ డకెట్



మ్యాచ్ తిలకిస్తున్న బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ



మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉదయం విద్యార్థుల క్యూ



మ్యాచ్ చూస్తున్న సీపీ రవిశంకర్ అయ్యనార్

సెంచరీతో ఆదుకున్న శుభమన్ గిల్

మరోసారి నిరాశ పరిచిన రోహిత్ శర్మ... ఇంగ్లండ్ విజయలక్ష్యం 399

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 4: ఇంగ్లండ్‌తో స్థానిక పీఎం పాలెం స్టేడియంలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ రసకందాయంలో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియాను శుభమన్ గిల్ సెంచరీతో (104) ఆదుకున్నాడు. మిగిలిన బ్యాటర్లు అంతగా రాణించకపోవడంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 255 పరుగులకు చాపచుట్టేసింది. ఇంగ్లండ్ ముందు 399 పరుగుల విజయలక్ష్యాన్ని ఉంచింది.

తొలి ఇన్నింగ్స్‌లో 14 పరుగులకే అవుటైన కెప్టెన్ రోహిత్ శర్మ.. రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలమై కేవలం 13 పరుగులకే పెవిలియన్ చేరాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో అదరగొట్టిన మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (17) రెండో ఇన్నింగ్స్‌లో ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు. అవుట్‌సైడ్ ఆఫ్ స్టంప్ మీదుగా ఆండర్సన్ వేసిన బంతిని డ్రైవ్ చేసేందుకు ప్రయత్నించి ఫస్ట్ స్లిప్‌లోని రూట్‌కు క్యాచిచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ (6) మరోసారి అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు.

భళి

వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభమన్ గిల్ (104) తొలి బంతి నుంచి దూకుడుగా ఆడాడు. రెహాన్ అహ్మద్ బౌలింగ్‌లో వరుసగా రెండు బౌండరీలు కొట్టి 60 బంతుల్లో ఎనిమిది బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధ సెంచరీ సాధించాడు. 52వ ఓవర్‌లో బషీర్ బౌలింగ్‌లో సింగిల్ చేసి సెంచరీ పూర్తిచేశాడు. శుభమన్ గిల్‌కు విశాఖలో ఇది తొలి సెంచరీ కాగా, టెస్టు కెరీర్‌లో రెండోది కావడం విశేషం. తర్వాత మరో నాలుగు పరుగులు జోడించిన గిల్... బషీర్ బౌలింగ్‌లో బెన్ ఫోక్స్‌కు క్యాచిచ్చి అవుటయ్యాడు. అక్షర పటేల్ (45), అశ్విన్ (26) మినహా మరెవరూ రాణించలేదు. కాగా తొలి టెస్టులో భారత్ బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టిన స్పిన్నర్ హార్ట్‌లీ రెండో టెస్టు సెకెండ్ ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. మూడో రోజు ఆటలో శ్రేయాస్ అయ్యర్, అక్షరపటేల్, కులదీప్ యాదవ్, బుమ్రాలను అవుట్ చేశాడు. కాగా రెండో రెండు ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 67 పరుగులు చేసింది.

పోటెత్తిన ప్రేక్షకులు

మూడోరోజు ఆదివారం కావడంతో మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. పెవిలియన్ వైపు స్టాండ్స్ నిండిపోయాయి. భారత్ బ్యాటింగ్ జరిగినంతసేపు కేరింతలు, చప్పట్లతో స్టేడియం హోరెత్తింది. సుమారు ఆరు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించారు. భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండీశ్వరినాథ్ ఆదివారం మ్యాచ్‌ను వీక్షించారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ గ్యాలరీలో సందడి చేశారు.



వికెట్ తీసిన ఆనందంలో అశ్విన్

రుద్రభూమి నుంచి రియల్టర్ రోడ్డు

» గ్రామపెద్దల సహకారం

» శ్మశానం చుట్టూ ప్రహరీ కట్టిస్తానన్న రియల్టర్

» గ్రామ పెద్దలకు భారీ స్థాయిలో ముడుపులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4:

ఆవరాజాంలో గ్రామ పెద్దలంతా ఏకమై రుద్రభూమి నుంచి ఒక రియల్టర్‌కు 60 అడుగుల వెడల్పు రోడ్డుకు అనుమతించారు. ఇందుకు ప్రతిగా రుద్రభూమి చుట్టూ రియల్టర్ ప్రహరీ నిర్మిస్తున్నాడు. కాని ఈ దారికి భూమిని కేటాయించినందుకు పెద్దలకు భారీగా ముడుపులు ముట్టాయని గ్రామస్థులు గుసగుసలాడుకుంటున్నారు.



రుద్రభూమి మధ్యనుంచి రియల్టర్ ఏర్పాటు చేస్తున్న రోడ్డు

ఆవసోమవరం పంచాయతీ సర్వే నంబర్ 91లో 1.84 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవలే ఆవసోమవరం పంచాయతీని రెండుగా విడదీసి కొత్తగా ఆవరాజాం పంచాయతీని ఏర్పాటు చేశారు. దీంతో సర్వే నంబరు 91 ఆవరాజాం పంచాయతీ పరిధిలోకి వచ్చింది. అంతకు ముందే ఈ సర్వే నంబరులో 84 సెంట్లు ఆవరాజాం వెళ్లడానికి రోడ్డులో ఉంది. మిగిలిన ఎకరాలో 76 సెంట్లలో ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. ఈ పాఠశాలను ఆనుకొని రుద్రభూమి ఉంది. పాఠశాలకు దగ్గరలో రుద్రభూమి ఉన్నందున విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వారికి కనబడకుండా ప్రహరీని నిర్మించారు. కాగా పాఠశాల, రుద్రభూమి వెనుక 20 ఎకరాలను ఒక రియల్టర్ కొని వెంచర్ వేస్తున్నాడు. అయితే ఈ వెంచర్‌లోకి వెళ్లడానికి ప్రధాన రహదారి లేదు. గతంలో రియల్టర్ పాఠశాలకు, రుద్రభూమికి మధ్య నుంచి వెంచర్‌కి దారి కోసం కేటాయించాల్సిందిగా అచ్యుతాపురం తహసీల్దార్‌కు అర్జీ పెట్టాడు. అది ప్రభుత్వ భూమి అయినందున కేటాయించలేమని తహసీల్దార్ నిరాకరించారు. దీంతో రియల్టర్ గ్రామ పెద్దలతో సంప్రదింపులు జరిపి పాఠశాలకు, రుద్రభూమికి మధ్య నుంచి 60 అడుగుల రోడ్డుకు భూమి కేటాయిస్తే రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మించి ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. పెద్దలు అంగీకరించడంతో శరవేగంతో రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం జరుగుతున్నది. అయితే పైకి రుద్రభూమి చుట్టూ రియల్టర్ ప్రహరీ నిర్మిస్తున్నప్పటికీ గ్రామ పెద్దలకు భారీగా ముడుపులు ముట్టాయని గ్రామస్థులు గుసగుసలాడుతున్నారు. రియల్టర్ రోడ్డు కోసం సుమారు ఏడు సెంట్లు పోతోంది. మిగిలిన 23 సెంట్లు రుద్రభూమి కుచించుకుపోయిందని గ్రామస్థులు అంటున్నారు. ప్రభుత్వభూమిని గ్రామపెద్దలు రియల్టర్‌కి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అధికారులు విచారణ జరిపితే నిజాలు బయటపడతాయని గ్రామస్థులు అంటున్నారు. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

వైసీపీలో గుర్తింపు లేదు

» డిప్యూటీ సీఎం పోలీసు కేసులు పెట్టిస్తున్నారు

» వేచలం ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి ఆవేదన

» భర్త, మరికొందరు నేతలతో కలిసి వైసీపీకి రాజీనామా

» నేడు చంద్రబాబు సమక్షంలో 500 కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరనున్నట్టు వెల్లడి

దేవరాపల్లి, ఫిబ్రవరి 4: వైసీపీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లేదని అధికార పార్టీకి చెందిన మండలంలోని వేచలం ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమపై పోలీసు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం సాయంత్రం తన భర్త, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బలరామమూర్తి, మరికొంతమంది వైసీపీ నేతలతో కలిసి తన నివాసం వద్ద మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, తనతోపాటు పలువురు నాయకులు, సుమారు 500 కుటుంబాల వారు వైసీపీకి రాజీనామా చేసి సోమవారం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో జరగనున్న 'రా.. కదలిరా' సభలో చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు చెప్పారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి బలరామమూర్తి మాట్లాడుతూ, 25 సంవత్సరాల నుంచి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వెంట వున్నానని, జడ్పీటీసీ సభ్యుడిగా, తరువాత రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడానికి తన వంతు కృషి చేశానని చెప్పారు. అయినాసరే తనకు గుర్తింపు ఇవ్వలేదు సరికదా ఏడాది నుంచి పార్టీకి తనను, తన కుటుంబాన్ని దూరంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధం లేని విషయాల్లో కలుగజేసుకొని తనను మానసికంగా ఇబ్బందులు పెట్టడమే కాకుండా పోలీసు కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. అవమానాలు, వేధింపులకు గురిచేసే పార్టీలో ఎందుకు వుండాలని ఆయన ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం తీరుతో విసుగు చెంది టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో కలిగొట్లకు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డు జగదీశ్వరరావు, వాకపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెనగంటి సింహాచలంనాయుడు, వైసీపీ నాయకులు దొగ్గ రమేశ్, గొర్లి గోవింద, గొర్రుపోటు సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ కోసం నినదించిన ఉద్యోగులు

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో సాగర సంగ్రామ దీక్ష

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం సాగర సంగ్రామ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా సీపీఎస్ రద్దుకోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. ఉద్యోగుల ఆశలను వమ్ము చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పీఆర్‌టీయూ నేత గోపీనాథ్ మాట్లాడుతూ ఎన్నికలకు తక్కువ సమయం ఉందని, చివరి అవకాశంగా ఓపీఎస్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆర్థిక కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ మాట తప్పిన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13.2 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యుడు నాత ప్రసాద్ మాట్లాడుతూ వాస్తవాలను వక్రీకరించేలా ప్రభుత్వం తప్పుడు ప్రచారాన్ని చేయించిందన్నారు. జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ మేనిఫెస్టోలోని సీపీఎస్ రద్దు హామీని ఎందుకు అమలుచేయలేదని సీఎంను ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ రమాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్ష ప్రాంగణంలో సీపీఎస్ అంతిమయాత్ర నిర్వహించారు. పాత పెన్షన్ పేరుతో ఏర్పాటు చేసిన సమాధి వద్ద నేతలు నివాళులర్పిస్తూ నిరసన తెలిపారు. పలువురు మహిళా ఉద్యోగులు చెవిలో క్యాబేజీలు పెట్టుకుని నిరసన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని నామవరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం మధ్యాహ్నం నామవరం గాంధీనగర్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నక్కపల్లి వైపు నుంచి వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వి.అనిత, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి వెంటనే స్పందించారు. గాయపడిన వ్యక్తిని పరామర్శించారు. వెంటనే 108కి సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.

89 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని 89 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు వైసీపీ నేతలతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీల కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగించారు. ఎనిమిది సొసైటీలకు కొత్త కమిటీలను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఏళ్ల తరబడి ఎన్నికలు నిర్వహించకుండా ప్రతి సొసైటీకి ముగ్గురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను ప్రభుత్వం నామినేట్ చేస్తూ వస్తోంది.

ఈ కమిటీల గడువు గత నెల 29తో ముగిసింది. వీటి కాలపరిమితి పొడిగించాల్సి ఉన్నా ఆలస్యం కావడంతో ఈనెల రెండో తేదీన నిర్వహించాల్సిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజనసభ చివరి నిమిషంలో రద్దు చేశారు. కాగా పర్సన్ ఇన్‌చార్జి కమిటీల కాలపరిమితిని మరో ఆరు నెలలు (ఈ ఏడాది జూలై 30 వరకు) పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో 98 సొసైటీలుండగా రాంబిల్లి మండలం దిమిలి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి ఇంకా గడువుంది.

మిగిలిన వాటిలో 89 సొసైటీలకు ఇప్పటి వరకు వున్న కమిటీలనే కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలవగా, మిగిలిన ఎనిమిది సొసైటీలకు కొత్తగా ముగ్గురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. వీటిల్లో ఐదు సొసైటీలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో, మూడు సొసైటీలు అనకాపల్లి జిల్లాలో వున్నాయి. అనకాపల్లి గౌరీ సొసైటీ, రావికమతం మండలం మేడివాడ సొసైటీలకు కొత్తవారిని నియమించారు. తుమ్మపాల సొసైటీకి గతంలో ఉన్న కమిటీని రద్దుచేసి సహకార శాఖ అధికారులతో కొత్త కమిటీని నియమించారు.

ఫ్లైయాష్ లారీలతో గొల్లలపాలెం వాసుల ఇక్కట్లు

పరవాడ, ఫిబ్రవరి 4: ఫ్లైయాష్ లారీల కాలుష్యంతో గొల్లలపాలెం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రహదారి వెంబడి వందలాది లారీలు సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్ నుంచి ఫ్లైయాష్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిపై కనీసం టార్పాలిన్ కూడా కప్పకపోవడంతో బూడిద ఎగిరి ఇళ్లల్లోకి, వాహనాలపై, పంటలపై పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూడిద కారణంగా కళ్లల్లో మంటలతో పాటు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామన్నారు. పెద్ద ఎత్తున ఫ్లైయాష్ ఎగిసి పడడంతో అనారోగ్య బారిన పడుతున్నామని, తరచూ ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునేవారే లేకపోయారని గ్రామస్థులు వాపోతున్నారు. రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి దారుణంగా తయారైందని గ్రామస్థులు చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బూడిద లారీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.



లారీల రాకపోకలతో ఎగిసిపడుతున్న ఫ్లైయాష్

ఓటమి భయంతో జగన్‌రెడ్డికి వణుకు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందుతామనే సంకేతాలు అందుతుండడంతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు ప్రారంభమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఆదివారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు ప్రజల నుంచి అందు తున్న ఆదరణను ఓర్వలేక వైసీపీ నేతలు తర్జన భర్జన పడుతున్నారన్నారు. మాడుగుల నియోజకవర్గంలో సోమవారం జరగనున్న రా.. కదలి రా.. బహిరంగసభకు విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ సభకు రెండు లక్షల మంది హాజరుకానున్నట్టు ఆయన చెప్పారు. ఐదేళ్లలో చేసిన అప్పులు గురించి గాని, ప్రభుత్వ భూములను బ్యాంకులను పెట్టిన తనఖాలు గురించి గాని, ప్రత్యేక హోదా, నిరుద్యోగ నిర్మూలనపై పెదవి విప్పకపోవడం అన్యాయమన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలం కాశీనాయుడు, కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

వృద్ధురాలిని మోసగించిన వలంటీర్ తొలగింపు

» ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4: మండలంలోని జేవీపాలెంలో ఎద్దు లక్ష్మి అనే వృద్ధురాలిని మోసగించి, ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 వేలు దొంగలించిన వలంటీర్ నడిగట్ల శ్రీనును విధుల నుంచి తొలగించినట్టు ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాపు నేస్తం, కులగణన సర్వే పేరుతో వేలి ముద్రలు వేయించుకొని వలంటీర్లు నడిగట్ల శ్రీను, పీలా సూర్యగణేష్, మరో ఇద్దరి సహకారంతో తన బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు కాజేసినట్టు ఎద్దు లక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు ఆ ఇద్దరి వలంటీర్లపై కార్యదర్శి పి. చంద్రకళతో కలిసి విచారణలో నిర్వహించినట్టు చెప్పారు. ఇద్దరి వలంటీర్లలో నడిగట్ల శ్రీను మాత్రమే వృద్ధురాలి బ్యాంకు ఖాతా నుంచి రూ. 10 వేలు అపహరించినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. వెంటనే వలంటీర్ శ్రీను దొంగలించిన మొత్తం నగదును తిరిగి బాధితురాలు లక్ష్మికి ఇప్పించడం జరిగిందన్నారు. దీంతో వలంటీర్ శ్రీనును తొలగిస్తూ స్థానిక కార్యదర్శి పి. చంద్రకళ పత్రాన్ని అందజేసిందన్నారు.



వలంటీర్ శ్రీనుకు తొలగింపుపత్రం అందిస్తున్న కార్యదర్శి చంద్రకళ

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : బండారు



మలునాయుడుపాలెం సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి



నక్కపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు

సబ్బవరం, ఫిబ్రవరి 4 : అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఒక తెలుగుదేశం పార్టీకే ఉందని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని మలునాయుడుపాలెంలో మాజీ ఎంపీపీ గండి దేముడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బండారు పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ విధ్వంస పాలన సాగిస్తుందన్నారు. అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. అన్నిటా అవినీతి రాజ్యమేలుతుందన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలను వెలికి తీసి, వత్తాసు పలికిన అధికారులను జైలుకు పంపిస్తామన్నారు. టీడీపీ నాయకుడు గండి దేముడు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పలువురికి బండారు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు భరణికాన బాబూరావు, పీవీఎస్ఎన్ రాజు, గండి రవికుమార్, బొండా సత్యారావు, ఎం.మహాలక్ష్మీనాయుడు, గండి ముత్యాల నాయుడు, కొటాన అప్పారావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలం కేంద్రంలో ఆదివారం టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అద్దూరి లోవరాజు, కేవీ సత్యనారాయణ, మీగడ సత్తిబాబు, మీసాల బాబులు, నడిగట్ల రమణ, పెదిరెడ్డి రమేశ్, కక్కిరాల సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మినిట్స్ హామీలను వెంటనే నెరవేర్చాలి

వాడనర్సాపురం, కొత్తపట్నం నేవీ నిర్వాసితులు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నేవీ నిర్వాసిత టీడీపీ మత్స్యకార నాయకులు

రాంబిల్లి, ఫిబ్రవరి 4: మినిట్స్ పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలని వాడనర్సాపురం, కొత్తపట్నం నేవీ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేవల్‌బేస్ ఏర్పాటుతో నిర్వాసితుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. మొదటి దశలోనే అధికారులు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీలు ఇవ్వడం లేదన్నారు. మత్స్యకారులతో అధికారులు చర్చలు జరిపి బోటు యజమానులకు రూ.2.5లక్షలు, ప్రతి కుటుంబంలోని మేజర్ కుమారులకు రూ.1.3లక్షలు ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కొత్తపట్నం, వాడనర్సాపురం మత్స్యకారులకు ప్యాకేజీలను ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారులు ప్యాకేజీని అమలు చేయకుంటే మత్స్యకారులమంతా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తపట్నం మాజీ సర్పంచ్ చోడిపల్లి సత్యనారాయణ, టీడీపీ మత్స్యకార రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లూరి దేముడు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి చోడిపల్లి ప్రసాద్, టీడీపీ మండల ఉపాధ్యక్షులు సూరాడ అప్పలరాజు, టీడీపీ నాయకులు చోడిపల్లి మంగరాజు, కోడ శ్రీనివాసరావు, జనసేన నేత చింతకాయల కోదండరావు, తదితరులు పాల్గొన్నారు.

పూడిమడకలో నాగూరమ్మ పండుగ రేపు

- 13న బాపనమ్మ పండుగ
- ఈ పండగలకు కఠినమైన ఆచారాలు పాటించనున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4: మండలంలోని పూడిమడకలో ఈనెల ఆరున నాగూరమ్మ, 13న బాపనమ్మ పండగలు జరపడానికి మత్స్యకార కుల పెద్దలు నిర్ణయించారు. ఈ పండగలు పూర్తి అయినంతవరకు ఎన్నో ఆచారాలను మత్స్యకారులు పాటిస్తారు. అమ్మవార్ల పండగలకు మాంసాహారం తినరు. ఎందుకంటే నాగూరమ్మ వైశ్య కులానికి చెందినదని, బాపనమ్మ బ్రాహ్మణ కులానికి చెందినదని, అందువల్లే అంత నిష్ఠగా చేస్తామని మత్స్యకారులు చెబుతారు. ఈ రెండు అమ్మవార్ల పండగలు మూడు వారాల పాటు చేస్తారు. ఈమూడు వారాలు మత్స్యకారులెవరూ మంచం మీద పడుకోరు. మంచం తిరగేసి దానిపై బొంత, దుప్పటి వేసుకొని పడుకుంటారు. వివాహాది శుభ కార్యాలకు చేయరు. తప్పని పరిస్థితిలో చేయాల్సి వస్తే పీటలు మీద కూర్చోపెట్టరు. భార్యాభర్తలు కూడా కలవరు. ఒకవేళ కలిస్తే మర్నాడు వారే తప్పు ఒప్పుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి క్షమాపణ వేడుకుంటారు. భార్యకు మగవాడి డ్రస్సు, భర్తకు చీర, జాకెట్టు కడతారు. భార్యాభర్తలిరువురి చేతులకు తాడుకట్టి గ్రామంలో తలయారి డప్పు కొడుతూ తిప్పి తర్వాత అమ్మవారి గుడికి వెళ్లి క్షమాపణ కోరుకుంటారు.

ప్రజాకంటకునికి సరైన బుద్ధి చెప్పాలి: ప్రగడ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రజల్ని అన్ని విధాలా హింసించే ప్రజాకంటకుడు జగన్‌కి వచ్చే ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేసిన జగన్ రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి నడిపించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలన్నారు. సోమవారం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో జరిగే రా...కదలిరా సభకు నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో టీడీపీ శ్రేణులు తరలి రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనసరెడ్డి నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడుబాబు, మేరుగు బాపునాయుడు, పొన్నమళ్ల కొండబాబు, పుర్రె శ్రీనివాస యాదవ్, లాలం నాగేశ్వరరావు, లాలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యపేటలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

నక్కపల్లి, ఫిబ్రవరి 4: మండలంలోని రాజయ్యపేటలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి హాజరయ్యారు. గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేత గెడ్డం బుజ్జి మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా ఆహారపు అలవాట్లు మార్చుకుని జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పిక్కి కోదండరావు, గోసల అంజి, వాసుపల్లి నూకరాజు, పిక్కి గంగరాజు, కోటి, కొండలరావు, గుర్రన్న పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐగా నరసింగరావు బాధ్యతల స్వీకారం



అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4: అనకాపల్లి ట్రాఫిక్ ఎస్ఐగా సీహెచ్. నరసింగరావు ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు అనకాపల్లి రూరల్ ఎస్ఐగా పనిచేస్తూ హైవే స్క్వాడ్‌కు బదిలీ అయ్యారు. అయితే అంతలోనే అనకాపల్లి ట్రాఫిక్‌కు బదిలీ కావడంతో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎస్. సత్యనారాయణ ఎస్.రాయవరంనకు బదిలీ అయ్యారు.

అదరహో 'ఆనందమేళా'

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఆనందమేళా కేకు కట్ చేస్తున్న ఎన్టీపీసీ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్‌ప్రకాష్, సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తదితరులు

పరవాడ, ఫిబ్రవరి 4 : సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపికా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సాధన క్రీడా మైదానంలో నిర్వహించిన ఆనందమేళా అదరహో అనిపించింది. ఈ కార్యక్రమాన్ని ఎన్టీపీసీ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్‌ప్రకాష్, సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా ప్రారంభించారు. తొలుత వారు కేకు కట్ చేసి కార్యక్రమానికి స్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న జెమ్‌లో ప్రతిభకనబరిచిన విద్యార్థినులకు సైకిళ్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు ఎన్టీపీసీ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సింహాద్రి జీజీఎం అందజేశారు. కార్యక్రమంలో దక్షిణ్ దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు మీనూ బాత్రా, దీపిక లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హా, క్లబ్ ప్రతినిధులతో పాటు అధికారులు, ఉద్యోగులు, బాల భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ప్రారంభం

పరవాడ, ఫిబ్రవరి 4 : మండలంలోని తానాం, పరవాడ, వెన్నెలపాలెం, కలపాక, నాయుడుపాలెం, రావాడ పంచాయతీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సర్పంచులు సిరపురపు అప్పలనాయుడు, వెన్నెల అప్పారావు, కూండ్రపు వరలక్ష్మి, మోటూరి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, ఎంపీడీవో కీర్తిస్పందన పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలి

పరవాడ, ఫిబ్రవరి 4 : రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట శ్మశానవాటికకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని, స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. శ్మశానవాటిక స్థలం ఎలమంచిలి నియోజకవర్గ పరిధి అచ్యుతాపురం మండలం నడింపల్లి రెవెన్యూలో ఉందని తెలిపారు. అక్కడ ఎమ్మెల్యే కన్నబాబుతో మాట్లాడి శ్మశానవాటిక సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో షేక్ జలీల్, ఎస్‌కే హిమామ్, ఎస్‌కే మౌలాలీ, అలీ పాల్గొన్నారు.

ఏపీకి బీజేపీ చేసింది శూన్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్

పాయకరావుపేట, ఫిబ్రవరి 3 : విభజన హామీలు అమలుచేయని బీజేపీ ఆంధ్రప్రదేశ్‌కి చేసింది శూన్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటన ఏర్పాట్లపై ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పిస్తామని, పోలవరం ప్రాజెక్ట్ నిర్మిస్తామని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పైగా ఇప్పుడ ఉ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈనెల 9న తుని, 10న చింతపల్లిలో షర్మిల రెడ్డి పర్యటన ఉందని, 9న తునిలో జరిగే పార్టీ బహిరంగసభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని జగతా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మారుతి నారాయణచక్రవర్తి, పి.అప్పలరాజు, ఎం. సింహాచలం, మద్దూరి ప్రకాష్, సుంకర సూర్యావతి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెం నీటి పథకాన్ని పరిశీలించిన అధికారులు



బంగారమ్మపాలెంలో నీటి పథకం పరిశీలిస్తున్న ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు

సబ్బవరం, ఫిబ్రవరి 4 : మండలంలోని బంగారమ్మపాలెంలో శిథిలావస్థకు చేరిన నీటి పథకాన్ని ఆదివారం ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు పరిశీలించారు. గత నెల 19వ తేదన 'ఆంధ్రజ్యోతి'లో 'బంగారమ్మపాలెం.. అభివృద్ధికి దూరం' శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఏఈ హిమబిందు మాట్లాడుతూ.. నీటి పథకం మరమ్మతులు చేపట్టడమా? లేదా పూర్తిగా కూల్చివేసి కొత్తగా నీటి పథకం నిర్మించడమా అన్నది పరిశీలించేందుకు వచ్చినట్టు చెప్పారు. టెస్టులు నిర్వహించి ఏం చేయాలన్నది నిర్ణయిస్తామన్నారు. అదేవిధంగా అంతకాపల్లిలోని నీటి పథకం కూడా పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య, గ్రామస్థులు దాడి కన్నంనాయుడు, దొడ్డి వీరఅప్పారావు, సూరి అప్పారావు, కార్యదర్శి సత్యనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రూప పాల్గొన్నారు.

అభ్యర్థులు 50 వేలు.. ఖాళీలు 8?

... 5వ పేజీ తరువాయి

తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. సాధారణంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే.. ఎస్జీటీలు మూడొంతులు, ఒక వంతు స్కూల్ అసిస్టెంట్ పోస్టులుంటాయి. కానీ ప్రస్తుతం విడుదల చేయనున్న డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 1,728 మంది ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయనున్నారని సమాచారం. వీటిలో ఒక్క కర్నూలు జిల్లాలోనే 1,646 ఖాళీలున్నట్టు చెబుతున్నారు. మిగిలిన జిల్లాల్లో నాలుగు, పది చొప్పున పోస్టులు ఉండగా, ఆరు జిల్లాల్లో ఒక్క ఎస్జీటీ పోస్టు కూడా లేదు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో కేవలం ఎనిమిది ఎస్జీటీ పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు వివరాలు అందాయని తెలిసింది.

50 వేల మంది నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో సుమారు 50 వేల మంది అభ్యర్థులు ఎస్జీటీ పోస్టుల కోసం నిరీక్షిస్తున్నారు. చివరిసారిగా 2018 అక్టోబరులో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 7,900 పోస్టులను భర్తీ చేసింది. వీటిలో ఎస్జీటీ పోస్టులు మూడు వేలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,500 ఉన్నాయి. మిగిలినవి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్ వంటి స్పెషల్ టీచర్ పోస్టులు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా విడుదల చేయనున్న నోటిఫికేషన్‌లోనూ కనీస ఎస్జీటీ పోస్టులు లేకపోవడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా డీఎడ్ పూర్తిచేసి వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది.

వీరంతా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం విశాఖ నగరంతో పాటు అవనిగడ్డ వంటి ప్రాంతాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తాజా నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం ఎనిమిది పోస్టులే ఉండడంతో ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. టీచర్ కావాలన్న తమ ఆశలను ప్రభుత్వం చంపేస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రతి జిల్లాలో కనీసం 300 పోస్టులను భర్తీచేసేలా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క కర్నూలు జిల్లాలోనే వేలాది ఖాళీలు ఎలా ఏర్పడ్డాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

తహసీల్దార్ హత్య దారుణం : రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4: విశాఖపట్నం జిల్లా చినగదిలి రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్యను అతి కిరాతకంగా హత్య చేయడం దారుణమైన విషయమని టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు రత్నాకర్ పేర్కొన్నారు. ఆదివారం డీవీఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేదా అనేది ఒక ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ హోదా కలిగిన తహసీల్దార్‌కే రక్షణ లేకుండా పోయిందన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. ఈ ఘటన వెనుక గల కారణాలను విశ్లేషించి సూత్రధారులను కనిపెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కలిసిన పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 : మున్సిపల్ గవరపాలెం హైస్కూల్ 1968-69 సంవత్సరంలో పదో తరగతి చదివిన మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో కలుసుకున్నారు. పదో తరగతి చదివి 55 ఏళ్ల తరువాత పాత స్నేహితులందరూ సమావేశమై ఆత్మీయ ఆలింగనం చేసుకుని కుటుంబాల యోగక్షేమాలను తెలుసుకుని ఆనందంగా గడిపారు. హైదరాబాద్, విశాఖపట్నం నుంచి వచ్చిన 36 మంది కలుసుకొని అలనాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకున్నారు. మిత్రులందరికీ ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ బహుమతులు అందజేశారు. స్వర్గీస్తులైన పాతమిత్రుల కోసం మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంటీవీ స్వామి, కొడుకుల లక్ష్మీమోహనరావు, బీసీహెచ్. కన్నాజీరావు, కేఎం నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఎంవీఆర్ జన్మదిన వేడుకలు



ఎంవీఆర్‌కు కేకు తినిపిస్తున్న కుటుంబసభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 : స్థానిక నరసింగరావుపేటలో ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవీఆర్) జన్మదిన వేడుకలను కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. కుటుంబసభ్యుల సమక్షంలో ఆయన జన్మదిన కేకును కట్ చేయగా.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, రాజకీయ పార్టీల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఆర్ సతీమణి సూర్యకుమారి, కుమారులు రాజేష్, సతీష్ పాల్గొన్నారు. అలాగే ఎంవీఆర్ పలు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

ఘనంగా పడమటమ్మ తీర్థం

కశింకోట, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని పడమటమ్మ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ యువనేత దాడి రత్నాకర్, విశాఖడెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ వద్ద అన్నసమారాధనను ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దాసరి రవిబాబు, గొంతిన గోపి తదితరులు వారికి శాలువాతో సత్కరించారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎద్దుల పరుగు పందాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వారి వెంట టీడీపీ నాయకులు కాండ్రేగుల సతీష్, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, పెంటకోట రాము, ఆడారి నరసింగరావు, తాకాశి కృష్ణ, వేగి దొరబాబు పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం తథ్యం'

మునగపాక, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం తథ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పార్టీ పరిశీలకుడు బొండా జగన్ అన్నారు. ఆదివారం మాడుగుల నియోజకవర్గంలో సోమవారం జరగనున్న రా.. కదలిరా.. బహిరంగ సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీమరశెట్టి శ్రీనివాసరావు, నాయకులు దాడి మునిలినాయుడు, పెంటకోట విజయ్, మొల్లేటి సత్యనారాయణ, శరగడం యోగి నాగేశ్వరరావు, శివాజీ, రమేష్, మురళీ, నాగు, రాజునాయుడు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

నక్కపల్లి, ఫిబ్రవరి 4: మండలంలోని ఉపమాకలో దుర్గాభవానీ ఆలయ 9వ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ చెప్పారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఆలయ ఉత్సవాలకు సంబంధించి రాటోత్సవాన్ని నిర్వహించారు. ఈనెల 10,11 తేదీల్లో అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొప్పిశెట్టి కొండబాబు, సిద్దాబత్తుల కృష్ణ, చెరుకూరి వెంకటేశ్వరరావు, వరహాలరావు పాల్గొన్నారు.

ఘనంగా పసలతల్లి తీర్థం

సబ్బవరం, ఫిబ్రవరి 4: మండలంలోని అసకపల్లి శివారు సున్నంబట్టీలు వద్ద గ్రామ దేవత పసలతల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 6గంటల నుంచే అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆర్ఈసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, సర్పంచ్ కర్రి నరసింగరావు, ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పారావు, దూలి నరేష్ అమ్మవారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ఈసీ మెంబరుగా వియ్యపు

ఎలమంచిలి, ఫిబ్రవరి 4 : న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఎలమంచిలి టైలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ ఎన్నికైనట్టు ఆయన తెలిపారు. ఈమేరకు ఆదివారం విశాఖలో జరిగిన రాష్ట్ర అసోసియేషన్ సమావేశంలో జిల్లాకు చెందిన వియ్యపు సత్యనారాయణ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రం అందుకున్నట్టు తెలిపారు. అనంతరం ప్రమాణ స్వీకారం జరిగిందన్నారు. రాష్ట్ర ఈసీ మెంబరుగా ఎన్నిక కావడం పట్ల ఎలమంచిలి టైలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు, తోటి దర్జీలు అభినందనలు తెలిపారు.

బీకేపల్లిలో ఉపాధి హామీ గ్రామసభ

కోటవురట్ల, ఫిబ్రవరి 4: మండలంలో బాపిరాజు కొత్తపల్లిలో సామాజిక ఆడిట్‌బృందాలు ఆదివారం సర్పంచ్ పెట్ల లింగంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామంలో రెండు రోజులు పర్యటించి చేసిన అభివృద్ధి పనులు, పింఛన్ల పంపిణీ వివరాలు అడిగి సేకరించారు. ఈ గ్రామసభలో సోషల్ ఆడిట్ బృందం తనిఖీ నివేదికను ఆమోదం పొందింది. ఎస్ఆర్‌పీ రామారావు, ఏపీవో గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 4: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో వినాయకుని ఆలయ వార్షికోత్సవం ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. జనసేన పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి. గోవింద్, టీడీపీ నాయకుడు గుర్రం రామకృష్ణ, జనసేన నాయకుడు పప్పల శివ, ఎ. గోవింద్, బి. లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో నేడు, రేపు కొళాయిలు బంద్

ఎలమంచిలి, ఫిబ్రవరి 4: మునిసిపాలిటీలో పలు వార్డులకు సోమ, మంగళవారాల్లో తాగునీటి కొళాయిల ద్వారా నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు మునిసిపల్ అధికారులు తెలిపారు. మునిసిపాలిటీకి ప్రధాన తాగునీటి వనరు అయిన సోముదేవుపల్లి వరహానది నుంచి ఎలమంచిలికి వచ్చే మెయిన్ పైపు లైన్ పి.ధర్మవరం వద్ద దెబ్బతినడంతో మరమ్మతు పనులు చేయిస్తున్నామని, అందువల్ల నీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. ఈ కారణంగా 4వ వార్డు నుంచి 19 వార్డు వరకు, అలాగే 25 వార్డుకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు.

'పల్లెకు పోదాం' విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

కొత్తూరు, ఫిబ్రవరి 4 : దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఏపీలో కూడా అధికారంలోకి రావాలంటే ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్.మాధవ్ పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో అనకాపల్లి అసెంబ్లీ పరిధిలోని ముఖ్య నేతలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఓటరు దగ్గరకు వెళ్లడంతోపాటు పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమం చేపట్టాలని సూచించారు. మోదీ చేసిన పనులను గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్లమెంటు కన్వీనర్ వర్మ, ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ బి. నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ సత్యనారాయణ, పొన్నగంటి అప్పారావు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీ సస్పెన్షన్ ఎత్తివేయాలి

- డీఎంహెచ్‌వోకు వినతి



డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ఉన్న హెల్త్ సెక్రటరీలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 : ఎలమంచిలి మండలం రేగుపాలెం ఏటికొప్పాక-1 సచివాలయం హెల్త్ సెక్రటరీ జె. జ్యోతిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని హెల్త్ సెక్రటరీలు డిమాండ్ చేశారు. ఆమె సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఎన్టీఆర్ వైద్యాలయంలోని డీఎంహెచ్ఓ కార్యాలయానికి శనివారం రాత్రి అధిక సంఖ్యలో హెల్త్ సెక్రటరీలు వచ్చి డీఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్‌కు వినతిపత్రం ఇచ్చారు. హెచ్‌బీ పర్సంటేజి రీడింగ్ విషయంలో జరిగిన సాంకేతిక లోపంపై నేరుగా హెల్త్ సెక్రటరీని సస్పెన్షన్ విధించడాన్ని ఏపీ యునైటెడ్ సచివాలయ హెల్త్ సెక్రటరీ అసోసియేషన్, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. హెచ్‌బీ పర్సంటేజీకు సంబంధించి మీటర్లల్లో సాంకేతిక సమస్యలు ఉండడం, ల్యాబ్ టెక్నీషియన్స్ చేస్తున్న పనిని ఏఎన్ఎంలతో చేయించడం సరికాదని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు పునరాలోచన చేసి జ్యోతిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రత్నం, ఆళ్ల దేవిక, జగన్మోహిని, కేవీ సత్యనారాయణ, కె.జగన్మోహనరావు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 : ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ఆదివారం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర నర్సింగ్‌హోమ్‌లో క్యాన్సర్ నివారణ అంశంపై అవగాహన సదస్సు జరిగింది. వాకర్స్‌క్లబ్ ప్రతినిధి డాక్టర్ డీడీ నాయుడు మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు అగనంపూడిలోని హోమిబాబా క్యాన్సర్ ఆస్పత్రిలోను, విశాఖలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో చేయించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ కోశాధికారి రాపేటి నారాయణరావు, అధ్యక్షుడు బీశెట్టి రామకృష్ణ, యల్లపు సాంబశివ, నల్లల దేముళ్లు పాల్గొన్నారు.

దేవాంగ కుటుంబీకుల ఆత్మీయ కలయిక

కొత్తూరు, ఫిబ్రవరి 4 : మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ సత్యనారాయణస్వామి ఆలయం వద్ద దేవాంగ కుటుంబీకుల ఆత్మీయ కలయిక ఆదివారం ఉత్సాహంగా జరిగింది. చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కాలెపు సదాసివరావు పాల్గొని మాట్లాడారు. 50 వసంతాలు పూర్తి చేసుకున్న మూడు జంటలను సన్మానించారు.

'కొత్తూరు పంచాయతీకి కార్యదర్శిని నియమించండి'

కొత్తూరు, ఫిబ్రవరి 4 : అనకాపల్లి మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీకి పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించి, పంచాయతీ వ్యవహారాలపై విచారణ చేపట్టాలని ఆ పంచాయతీ వార్డు మెంబర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబరు తాడి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ.. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన రమాదేవి పదోన్నతిపై బదిలీ అయ్యారన్నారు. అప్పటి నుంచి పలువురు ఇన్‌చార్జిలతోనే అరకొరగా పాలన సాగుతోందన్నారు. ఆరు నెలలుగా జరిగిన అన్ని పనులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. జిల్లా అధికారులు స్పందించి ఇంతవరకు అయిన నిధుల వ్యయం, ఖర్చులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని ఆయన వివరించారు.

ఓటు ఫర్ ఓపీఎస్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 4 : పాత పెన్షన్ పథకం సాధన కోసం తలపెట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం యూటీఎఫ్ నాయకులు ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి ఆరు నుంచి 12వ తేదీ వరకు పోస్ట్‌కార్డు ఉద్యమం చేస్తామన్నారు. అలాగే ఫిబ్రవరి 13 నుంచి 29వ తేదీ వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉన్న అన్ని రాజకీయపార్టీల నాయకులకు సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు వత్సవాయి శ్రీలక్ష్మి, గాయత్రి, జోగా రాజేష్, నడిగట్ల శేషకుమార్, చైతన్య పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆంజనేయ స్వామి తీర్థం

ఎలమంచిలి, ఫిబ్రవరి 4: మునిసిపాలిటీ రామారాయుడుపాలెం వార్డులో ఆదివారం నిర్వహించిన ఆంజనేయస్వామివారి తీర్థం ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నగరం వంతెన నిర్మాణానికి నిర్లక్ష్యపు చీడ!

- రెండు నియోజకవర్గాలను కలిపేలా టీడీపీ హయాంలో ప్రతిపాదనలు
- అప్పట్లో నగరం నుంచి నిండుగొండ వరకు బీటీ రోడ్డు, వంతెనకు రూ.95 లక్షలు మంజూరు
- రూ.28 లక్షల ఖర్చుతో పిల్లర్లు, గ్రావెల్ రోడ్డు పనులు పూర్తి
- వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టించుకోని వైనం



లంక చెరువు వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం

నర్సీపట్నం, ఫిబ్రవరి 4 : నర్సీపట్నం, చోడవరం నియోజకవర్గాలను కలిపే కీలకమైన వంతెన నిర్మాణంపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో నర్సీపట్నం మండలం నగరం నుంచి రోలుగొంట మండలం నిండుగొండ వరకు మూడు కిలోమీటర్లు బీటీ రోడ్డు, నగరం శివారు లంక చెరువు మీద వంతెన నిర్మాణానికి ప్రతిపాదన పెట్టారు. పంచాయతీ రాజ్‌శాఖ నుంచి రూ.95 లక్షలు నిధులు మంజూరయ్యాయి. నగరం నుంచి నిండుగొండ వరకు గ్రావెల్ వేసి, లంక చెరువు మీద వంతెన నిర్మించేందుకు పిల్లర్లను నిర్మించారు. ఈ పనులకు కాంట్రాక్టర్ రూ.25 లక్షలు ఖర్చు చేశారు. ప్రభుత్వం నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఆ తరువాత వివిధ కారణాలతో ఎన్నికలకు ఆరు నెలల ముందే కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10లక్షల బిల్లులు మంజూరు కాలేదు. పనులు కొనసాగింపుపై ఏ నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యం వహించారు. దీంతో బీటీ రోడ్డు, వంతెన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

పట్టించుకోని వైసీపీ పాలకులు

వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయి దాదాపు ఐదేళ్లు అవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే పనులు ముందుకు సాగడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.



నగరం గ్రామం నుంచి వంతెన వరకు వేసిన గ్రావెల్ రోడ్డు

నిర్మాణం పూర్తయితే రైతులకు ప్రయోజనం

రెండు నియోజకవర్గాలను కలిపే కీలకమైన వంతెన ఇది. దీని పనులు పూర్తయి, అందుబాటులోకి వస్తే రెండు నియోజవర్గాల రైతులకు చాలా ప్రయోజనం చేకూరుతుంది. కొత్తలక్ష్మీపురం, నగరం, గురొందరపాలెం తదితర గ్రామాల ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. ప్రజలు రోలుగుంట వెళ్లాల్సి వస్తే చుట్టూ.. తిరిగి పెదబొడ్డేపల్లి మీదుగా వెళ్లాల్సి వస్తుంది. అదే ఈ వంతెన పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే కేవలం మూడే మూడు కిలోమీటర్లు ప్రయాణం చేస్తేచాలు నిండుగొండ చేరుకోవచ్చునని అంటున్నారు. అదేవిధంగా, రైతులు వ్యవసాయ ఉత్పత్తులను రోలుగుంట, కొత్తకోట, రావికమతం, చోడవరం తదితర ప్రాంతాలకు తరలించుకునేందుకు దగ్గర మార్గం.

నాతవరం వసతిగృహం
విద్యార్థి మృతిపై ప్రజా సంఘాల ధర్నా

- వార్డెన్‌ను సస్పెండ్ చేసి, మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి
- నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి వద్ద నినాదాలు
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని ఆర్డీవో హామీ



విద్యార్థి మృతిపై డీఎస్‌డబ్ల్యూవో అజయ్‌బాబును నిలదీస్తున్న ఆందోళనకారులు



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, ఫిబ్రవరి 4 : గొలుగొండ ఎస్టీ బాలుర వసతి గృహంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీ బాలుర వసతి గృహంలో దావీద్ రాజ్ అనే విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రి వద్ద ప్రజా సంఘాలు, విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ధర్మరాజు మాట్లాడుతూ గిరిజన విద్యార్థి మృతికి వార్డెన్ నిర్లక్ష్యమే కారణమన్నారు. విద్యార్థి చనిపోతే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. డీఎస్‌డబ్ల్యూవో అజయ్‌బాబు ఆందోళనకారులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. జరిగిన ఘటనపై విచారణ చేసి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. దీనికి ఆందోళనకారులు అంగీకరించ లేదు. ముందు వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని వారంతా పట్టుబట్టారు. చివరకు ఆర్డీవో జయరాం వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళనను విరమించారు. ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల, అడిగర్ల రాజు, బొట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'తాండవ' డ్యామ్ వద్ద యువకుడిపై దాడి

- అల్లిపూడికి చెందిన పలువురిపై నాతవరం పోలీసులకు ఫిర్యాదు
- స్టేషన్‌కు ఇరువర్గాల వారు భారీగా చేరిక
- జరిగిన ఘటనను తెలుసుకున్న ఎస్ఐ



పోలీస్ స్టేషన్ వద్ద గుముగూడిన ఇరువర్గాల వారు

నాతవరం, ఫిబ్రవరి 4 : మండలంలోని తాండవ రిజర్వాయర్ డ్యామ్ దగ్గర ఆదివారం తన కుమారుడిపై కాకినాడ జిల్లా అల్లిపూడి గ్రామానికి చెందిన కొందరు దాడి చేశారని మాధవనగరం గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావు నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అల్లిపూడి గ్రామానికి చెందిన సుమారు యాభై మంది యువకులు, మాధవనగరం గ్రామానికి చెందిన యాభై మంది వరకు ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడారు. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలివి. తాండవ డ్యామ్ వద్ద ఆదివారం అల్లిపూడికి చెందిన యాభైమంది వరకు యువకులు పిక్నిక్ ఏర్పాటు చేసుకున్నారు. అలాగే, నాతవరం మండలం మాధవనగరం గ్రామానికి చెందిన కొందరు యువకులు కూడా ఇక్కడికే పిక్నిక్‌కు వెళ్లారు. అల్లిపూడికి చెందిన కొందరు యువకులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ మాధవనగరానికి చెందిన గంటా మణికంఠ వీరిని ప్రశ్నించాడు. దీంతో అల్లిపూడికి చెందిన కొందరు యువకులు అతనిపై దాడిచేశారంటూ మాధవనగరంలో ఉన్న పెద్దలకు తెలియజేశారు. దీనిపై అల్లిపూడికి చెందిన యువకులు మాధవనగరం పెద్దలకు కూడా సరైన సమాధానం చెప్పకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద ఇరువర్గాలవారు భారీగా గుమిగూడడంతో ఎస్ఐ రామారావు వారితో చర్చలు జరిపి ఘటన వివరాలు తెలుసుకున్నారు.

కొండలఅగ్రహారంలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీ



పోటీలో వేసి అందమైన ముగ్గు

మాకవరపాలెం, ఫిబ్రవరి 4 : కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా ఆదివారం మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై అందమైన ముగ్గులు వేశారు. అదే గ్రామానికి చెందిన సుర్ల విజయ్, పైడిపాలకు చెందిన రుత్తల భవానీ, కొండలఅగ్రహారానికి చెందిన డి.కిరణ్మయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడంతో వారికి పోలిరెడ్డి రమణ, సుర్ల శంకరరావుతో పాటు గ్రామ పెద్దలు వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగరాజు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'



బంగారుమెట్టలో బాబు భరోసా పత్రాలు అందిస్తున్న చేస్తున్న శేషు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 4 : టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి సాయం శేషు అన్నారు. బంగారుమెట్టలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులమయంగా మారిందన్నారు. మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు మంచిరోజులు రావాలంటే చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లపు జగ్గారావు, దొండా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన రాజేశ్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని వడ్డాది గ్రామానికి చెందిన అదత్రాపు రాజేశ్ అదృశ్యమైనట్టు అతని భార్య ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. రాజేశ్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతో మూడు పర్యాయాలు ఇంటి నుంచి వెళ్లిపోయి, కొంతకాలం తరువాత ఇంటికి వచ్చేవాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. అయితే 2021 ఆగస్టులో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన తన భర్త నేటికీ ఇంటికి చేరలేదని వివరించిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 4 : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఓ.శ్రీనువాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఖాళీ సమయాల్లో వీటిని చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిందిగా కోరారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



దేవరాపల్లిలో ఆర్‌బీకే భవనం ప్రారంభోత్సవంలో ముత్యాలనాయుడు

దేవరాపల్లి, ఫిబ్రవరి 4 : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. దేవరాపల్లిలో సచివాలయ భవనాన్ని, చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు, నేరెళ్లపూడికి వేసిన రోడ్డును, కొత్తపెంట నుంచి ఎన్.గజపతినగరం, సత్యనారాయణపురం నుంచి చేనులపాలెం వెళ్లే రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి సత్యం, కిపర్తి భాస్కరరావు, బూరే బాబూరావు, సూరినాయుడు, కృష్ణమూర్తి కేవీ రమణ పాల్గొన్నారు.



విజయరామరాజుపేటలో రైతు భరోసా కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : విజయరామరాజుపేటలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణరాజు, జడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ యల్లపు విజయకుమార్, స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ యల్లపు గోవింద, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన వృద్ధునికి సాయం



వృద్ధుడికి నగదు అందిస్తున్న రమణ

రోలుగుంట, ఫిబ్రవరి 4 : బుచ్చెంపేట గ్రామంలో గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైన ములంపాక నాగరాజుకు ఇదే గ్రామానికి చెందిన అనిమిరెడ్డి రమణ ఆదివారం బాసటగా నిలిచారు. ఇతని ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించారు.



కె.కోటపాడు మండలం గొండుపాలెంలో సోమవారం చంద్రబాబు సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నాయకులు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు - కె.కోటపాడు

కోనాం గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ, ఫిబ్రవరి 4 : కోనాం గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.హిమాచల ఆదివారం తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యబోధన ఉంటుందన్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన బాలికలు ఐదో తరగతిలో చేరేందుకు ఈ ఏడాది నాలుగో తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసినవారై ఉండాలన్నారు. ఇంటర్‌లో చేరేందు ఈ ఏడాది పదో తరగతి చదువుతున్నవారు లేదా పది పాసైనవారు అర్హులుగా పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

అభ్యర్థులు 50 వేలు.. ఖాళీలు 8?

... 5వ పేజీ తరువాయి

తీవ్ర నిరాశలో కూరుకుపోయారు.

సాధారణంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే.. ఎస్జీటీలు మూడొంతులు, ఒక వంతు స్కూల్ అసిస్టెంట్ పోస్టులుంటాయి. కానీ ప్రస్తుతం విడుదల చేయనున్న డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 1,728 మంది ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయనున్నారని సమాచారం. వీటిలో ఒక్క కర్నూలు జిల్లాలోనే 1,646 ఖాళీలున్నట్టు చెబుతున్నారు. మిగిలిన జిల్లాల్లో నాలుగు, పది చొప్పున పోస్టులు ఉండగా, ఆరు జిల్లాల్లో ఒక్క ఎస్జీటీ పోస్టు కూడా లేదు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో కేవలం ఎనిమిది ఎస్జీటీ పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు వివరాలు అందా యని తెలిసింది.

50 వేల మంది నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో సుమారు 50 వేల మంది అభ్యర్థులు ఎస్జీటీ పోస్టుల కోసం నిరీక్షిస్తున్నారు. చివరిసారిగా 2018 అక్టోబరులో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 7,900 పోస్టులను భర్తీ చేసింది. వీటిలో ఎస్జీటీ పోస్టులు మూడు వేలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,500 ఉన్నాయి. మిగిలినవి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్ వంటి స్పెషల్ టీచర్ పోస్టులు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా విడుదల చేయనున్న నోటిఫికేషన్‌లోనూ కనీస ఎస్జీటీ పోస్టులు లేకపోవడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా డీఎడ్ పూర్తిచేసి వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. వీరంతా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం విశాఖ నగరంతో పాటు అవనిగడ్డ వంటి ప్రాంతాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తాజా నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం ఎనిమిది పోస్టులే ఉండడంతో ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. టీచర్ కావాలన్న తమ ఆశలను ప్రభుత్వం చంపేస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రతి జిల్లాలో కనీసం 300 పోస్టులను భర్తీచేసేలా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క కర్నూలు జిల్లాలోనే వేలాది ఖాళీలు ఎలా ఏర్పడ్డాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.


రావికమతంలో మంచు సోయగాలు



రావికమతం ఫిబ్రవరి 4 : మండలంలో రెండు రోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. వేకువజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు ఇదే వాతావరణం కనిపిస్తోంది. దీంతో వివిధ పనులకు బయటకు వెళ్లి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నాయి. మంచు వల్ల మామిడి పంటకు నష్టమని రైతులు చెపుతున్నారు. ఇదిలావుంటే, మన్యంలో కనువిందుచేసే మంచు అందాలు మైదాన ప్రాంతంలో కనిపిస్తుండడంతో ప్రకృతి ప్రేమికులు సంబరపడుతున్నారు.



చినపాచిల రోడ్డులో ఉయదం ఏడు గంటలకు కురుస్తున్న ముంచు



ఉపాధ్యాయ సంఘ నాయకులు గృహ నిర్బంధం



సంఘ నాయకుడు జగన్నాథరావు హౌస్ అరెస్టు

నాతవరం, ఫిబ్రవరి 4 : సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాలు విశాఖపట్నంలో ఆదివారం తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా జిల్లాలోని పలువురు సంఘం నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఇందులో భాగంగా నాతవరంలో ఉంటున్న ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎస్.జగన్నాథరావును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. నిబంధనలు అతిక్రమించి ధర్నాకు వెళితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలావుంటే, కొందరు ఉపాధ్యాయులు పోలీసులకు తెలియకుండా ధర్నాకు తరలి వెళ్లారు.

కొత్తకోట హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు సందడి



కొత్తకోట హైస్కూల్‌లో కలుసున్న పూర్వ విద్యార్థులు

రావికమతం, ఫిబ్రవరి 4 : కొత్తకోట హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వీరంతా వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఓచోట కలవడంతో కోలాహల వాతావరణం నెలకొంది. తొలుత ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు ఆటపాటలతో సరదాగా గడిపారు.

టెన్త్ విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీడీ రాజేశ్వరి

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 4 : పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రేరణ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.రాజేశ్వరి సూచించారు. నర్సీపట్నంలో ఏర్పాటైన ఈ తరగతులను ఆదివారం ఆమె ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి తొలి మెట్టుగా పేర్కొన్నారు. అంతా చక్కగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయుల వద్ద నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నరసింహులు, చాముండేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.